క్లుప్తంగా

ఏరియా మనుగడను కాపాడండి

మణుగూరుటౌన్: మణుగూరు సింగరేణి ఏరియా మనుగడ కోసం ఓసీ విస్తరణ ఉన్న అడ్డంకులు తొలగించాలని, ఇందుకోసం నిర్వాసితులకు మెరుగైన ప్యాకేజీ ప్రకటించాలని ఇఫ్టూ నాయకులు కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుతో కలిసి సింగరేణి సీఎండీ బలరాంనాయక్, జీఎం(కో–ఆర్డినేషన్) సయ్యద్ మోహబూబ్ సుభానీకి శనివారం వినతిపత్రాలు అందజేశారు. గోదావరి లోయ బొగ్గు గని కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి నాజర్‌పాషా, నాయకులు మిడిదొడ్ల నాగేశ్వరరావు, సురేందర్‌రెడ్డి, జయపాల్ రెడ్డి, అడపా స్వామి, గోవిందు పాల్గొన్నారు.

ప్రేమపేరుతో మోసం.. వ్యక్తిపై కేసు నమోదు

అశ్వారావుపేటరూరల్: యువతిని ప్రేమపేరుతో మోసం చేసిన వ్యక్తిపై శనివారం కేసు నమోదైంది. మండలంలోని గంగారానికి చెందిన భోగి రాజు గంగారం కాలనీకు చెందిన 21 ఏళ్ల యువతిని ప్రేమించానని నమ్మించి ఏడాదిన్నరగా సహజీవనం చేస్తున్నాడు. ఇటీవల పెళ్లి చేసుకోవాలని యువతి ఒత్తిడి చేయగా తనకు గతంలోనే పెళ్లయిందని, ఇద్దరు పిల్లలు ఉన్నారని చెప్పడంతో ఆమె పోలీసులను ఆశ్రయించింది. దీంతో రాజుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై యయాతి రాజు తెలిపారు.

మహిళ అదృశ్యంపై..

ములకలపల్లి: ఇంటి నుంచి వెళ్లిన మహిళ తిరిగి రాకపోవడంతో భర్త ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మండలంలోని మంగపేటకు చెందిన జమిలి రమాదేవి అలియాస్ మయూరి భర్త వసంతరావు, ఇద్దరు పిల్లలతో జీవిస్తోంది. హైదరాబాద్‌లో బ్యాగ్‌ల తయారీ పని ఉందని డిసెంబర్ 22న ఇంటి నుండి వెళ్లిన ఆమె జనవరి 5వ తేదీ వరకు చిన్న కొడుకుతో ఫోన్ మాట్లాడినా ఆతర్వాత స్విచ్ఛాఫ్ వస్తోంది. ఎక్కడ వెతికినా ఆచూకీ లేకపోవడంతో ఆమె భర్త ఫిర్యాదుతో శనివారం కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రివాల్వింగ్ గేట్ ఏర్పాటు చేయాలి

మణుగూరుటౌన్: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలోని రెసిడెన్షియల్ క్వార్టర్ల సమీపంలో కొందరు ప్రైవేట్ వ్యక్తులు ఉంటున్నారని, వారి రాకపోకలు కాలనీ మీదుగా లేకుండా రివాల్వింగ్ గేట్ ఏర్పాటు చేయాలని స్థానిక కార్మికులు ఎస్‌ఓటూ జీఎం శ్యాంసుందర్‌కి శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కొందరు ప్రైవేటు వ్యక్తులు సింగరేణి స్థలాన్ని కబ్జా చేశారని, ఇక్కడ అసంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని తెలిపారు. వారిని అరికట్టడంతో పాటువారు రాకపోకలు కొనసాగించే ప్రదేశంలో రివాల్వింగ్ గేట్ ఏర్పాటు చేయాలని కోరారు. ప్రమోద్, వరలక్ష్మి వినతిపత్రం అందజేసిన వారిలో ఉన్నారు.

ఇసుక కష్టాలు తీర్చాలి

భద్రాచలంటౌన్: గోదావరి తీరంలోని పట్టణ ప్రజల ఇసుక కష్టాలు తీర్చాలని కోరుతూ.. బీఆర్‌ఎస్ మండల కమిటీ ఆధ్వర్యంలో అంబేడ్కర్ సెంటర్‌లో శనివారం నిరసన చేపట్టారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పార్టీ కన్వీనర్ ఆకోజు సునీల్ కుమార్ మాట్లాడుతూ.. ఇసుక అక్రమ రవాణాపై రాష్ట్ర ప్రభుత్వం కఠినంగా ఉందని చెబుతూనే అక్రమార్కులకు అండగా ఉంటుందని ఆరోపించారు. ప్రత్యేక జీవో అమలు చేసి పట్టణంలో అవసరాలకు ఇసుక ఉచితంగా ప్రభుత్వం అందించాలని ఆయన డిమాండ్ చేశారు. కోటగిరి ప్రమోద్ కుమార్, రేపాక పూర్ణచంద్రరావు, జయ ప్రేమ కుమార్, రామకృష్ణ, తాండ్ర ప్రసాద్, కొల్లిపాక శివ, రావూరి రవి కిరణ్, ఇమంది నాగేశ్వరరావు, ప్రియాంక, రాహుల్, కుందూరు అప్పారావు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

చర్ల: భవన నిర్మాణ రంగంలో పని చేస్తున్న కార్మికుల సమస్యల పరిష్కారానికి మార్చి 28న నిర్వహించనున్న చలో ఢిల్లీ కార్యక్రమానికి కార్మికులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు వేర్పుల మల్లికార్జునరావు పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రంలోని సీపీఐ పార్టీ కార్యాలయంలో యూనియన్ మండల అధ్యక్షుడు మాల్యాద్రి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నాయకులు అనీల్, రమణ, మహేష్, రవి, నాగేశ్వరావు, తిరుపతి, సత్యనారాయణ, రాంబాబు, రాజు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

'హలో బీసీ- చలో ఢిల్లీ'

మణుగూరురూరల్: ఈ నెల 25వ తేదీన నిర్వహించ తలపెట్టిన హలో బీసీ చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి, ఉమ్మడి ఖమ్మం జిల్లా ఇన్‌చార్జ్ బుర్రా సోమేశ్వర్‌గౌడ్ పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 25వ తేదీన ఉదయం 6గంటలకు సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నుంచి ఉచిత ప్రత్యేక రైలు బయలుదేరుతుందని, కార్యక్రమానికి వచ్చే వారు 9912462558 నంబర్‌కు తమ ఆధార్ కార్డ్ నంబర్లు పంపాలని తెలిపారు. బీసీ సంఘం మండల కన్వీనర్ వెంకట్రావు గౌడ్, నాయకులు పెనుగొండ సాంబ, సూర సుధాకర్, శివరాత్రి వెంకన్న పాల్గొన్నారు.

బొమ్మ.. రాతల్లో కళాపూర్ణుడు!

- సాహిత్యం, కవితలతో ప్రతిభ
- వ్యర్థాలతో అర్థవంతమైన ఆకృతులు
- ఔరా అనిపించుకుంటున్న విశ్రాంత ఉద్యోగి ఎల్లయ్య

సండే స్పెషల్


రావి, శ్రీగంథం ఆకులపై వేసిన బొమ్మలు


మట్టితో తీర్చిదిద్దిన బొమ్మలు.. చాక్‌పీస్‌లపై చెక్కిన ఆకృతులు

మణుగూరుటౌన్: ఆయన సింగరేణి విశ్రాంత ఉద్యోగి. కానీ ఆయనకున్న అభిరుచిని కొనసాగించడంలో విశ్రమించడం లేదు. రిటైర్డ్‌కు పూర్వం కూడా వృత్తిని బాధ్యతగా నిర్వర్తిస్తూనే కళల్లో తనకున్న అభిరుచిని 37 సంవత్సరాలుగా ప్రవృత్తిగా మార్చుకున్నాడు. గుర్తింపు కోసం, అవార్డుల కోసం వేచి చూడలేదు. ఖాళీగా ఉన్న సమయాల్లో కథలు, కవిత్వాలు రాయడం, వ్యర్థ పదార్థాలతో అర్థవంతమైన బొమ్మలను తీర్చిదిద్దడంతో పాటు ప్రతి వస్తువునూ కళాత్మక దృష్టితో చూడటం ఆయనకు అలవాటు. తరచూ సింగరేణి, తదితర పోటీల్లో పాల్గొంటూ పలు అవార్డులు అందుకుని ప్రస్తుతం సాహితి స్రవంతి మణుగూరు శాఖ వ్యవస్థాపక అధ్యక్షుడిగా ఉన్నారు. ఆయనే మణుగూరు అశోక్‌నగర్‌కి చెందిన 'బొమ్మరాత ఎల్లయ్య'.

కళారూపాలకు ప్రాణం..

సింగరేణి ఉద్యోగిగా విధులు నిర్వహిస్తూనే.. ఆయన సాహిత్యం, కథా రచనలు, కవితలతో నెమలీకలు పుస్తకం, చతురోక్తులు, పాటలు, బాలగేయాలు రచించారు. వ్యర్థంతో అర్థవంతమైన ఆకృతులు చేశాడు. సుద్దరాయిలపై ఆకృతులు చెక్కడం, ఇసుకతో తాజ్‌మహాల్, గోదావరి వద్ద లభించే ఇసుక రాళ్లతో మిణుగురు పురుగులు, తేలు వంటి ఆకృతులుగా తీర్చిదిద్దడం, థర్మాకోల్ షీట్‌లతో సీసాలో ఈఫిల్ టవర్, తాజ్‌మహల్, చాక్‌పీస్‌లపై గొల్లబామ, వీణ, రకారకాల బొమ్మలు చెక్కడం, రావి, శ్రీగంథం ఆకులపై అందమైన బొమ్మలు వేయడం, మట్టితో బొమ్మలు తయారు చేయడంతో పాటు తాటాకులపై రామాయణం రచించి అందరి ప్రశంసలు పొందారు. 25 ఏండ్లలో 300కి పైగా కవితలు రాశారు. తరచూ పలు ప్రముఖ మ్యాగజైన్లు, ప్రముఖ పత్రికలకూ కవిత్వాలు పంపడం అవి ప్రచురితం కావడం పరిపాటే.

అవార్డులు.. ప్రశంసలు

బొమ్మలు మలచడంలో రచనల్లో ప్రతిభ చూపుతున్న ఎల్లయ్యకు పలు అవార్డులు దక్కయి. ప్రశంసల వెల్లువిరిచాయి. అందులో భాగంగా 2010లో చిగురు సాహిత్య అకాడమి కొత్తగూడెం నుంచి ఆయన అవార్డు అందుకున్నారు. నానోలు కవిత్వానికి 2013లో ఆంధ్ర సారస్వత సమితి నుంచి మచిలీపట్నం అవార్డు 2013లో అందుకున్నారు. పలు పోటీల్లో పాల్గొని ప్రశంసా పత్రాలు, అవార్డులు పొందారు. 86 తాటాకులపై 33 రోజుల్లో సంక్షిప్తంగా రామాయణం రచించి అందరి ప్రశంసలు పొందారు.

కళాదృష్టితో చూడాలి



కళా దృష్టితో చూస్తే ప్రతివస్తువులోనూ ఓ అద్భుతమైన ఆకృతి దాగి ఉంటుంది. ప్రతి మనిషికి కళలు సాంత్వన కలిగిస్తాయి. ఒక కవిగా, రచయితగా నా రచనల ద్వారా సామాజిక చైతన్యాన్ని, సమాజంలో మార్పును తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నాను. ఎందరో కవులు, రచయితలు ప్రభుత్వ ప్రోత్సాహం లేక ఇంటికే పరిమితమయ్యారు. ప్రభుత్వం ప్రోత్సహించి వారిలో కళను గుర్తించాలి.

– బొమ్మరాత ఎల్లయ్య

వెలుగుచూసిన అక్రమాలు

- సామాజిక తనిఖీలో బహిర్గతం
- 86 పనుల నిర్వహణ తీరుపై షోకాజ్ నోటీసులు
- రూ.29 వేల జరిమానా.. రూ.48 వేల రికవరీకి ఆదేశం


సామాజిక తనిఖీ ప్రజావేదికలో విచారణ చేస్తున్న అధికారులు

బూర్గంపాడు: మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులపై జరిగిన సామాజిక తనిఖీ బహిరంగ విచారణ ప్రజా వేదికలో కొన్ని అక్రమాలు వెలుగుచూశాయి. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం జరిగిన 17వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదికలో మండలంలోని జరిగిన 568 పనులపై విచారణ కొనసాగింది. గ్రామసభ తీర్మానాలు లేకుండానే పలు గ్రామాల్లో ఉపాధిహామీ పనులు చేపట్టినట్లు విచారణలో నిర్ధారణ చేశారు. మస్టర్ల నిర్వహణలో దిద్దుబాట్లు ఉండటం, ఎఫ్‌ఏలు, టీఏల సంతకాలు లేకపోవటాన్ని అడిట్ బృందాలు గుర్తించి ఆధారాలు బయటపెట్టారు. కొన్నిచోట్ల పనులు చేసిన కూలీలకు వేతనాలు అందకపోవటం, కొన్నిచోట్ల పనులకు రానివారికి కూడా మస్టర్లు వేయటం జరిగిందని సోషల్ అడిట్ బృందాలు తమ నివేదికల్లో వెల్లడించాయి. పనుల నిర్వహణలో జరిగిన తప్పోప్పులపై అడిషనల్ డీఆర్‌డీఓ రవికుమార్, డిస్ట్రిక్ట్ విజిలెన్స్ ఆఫీసర్ రమణ,అంబుడ్స్‌మెన్ నాగప్రకాశ్‌లు విచారణ చేశారు. నివేదికల ఆధారంగా 86 పనులకు సంబంధించి బాధ్యులకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. రూ 29వేలు జరిమానా విధించారు. అదేవిధంగా జరిగిన తప్పులకు గాను బాధ్యుల నుంచి రూ.48వేలు రికవరీ చేయాలని ఆదేశించారు. తదుపరి చర్యల నిమిత్తం జిల్లా అధికారులకు నివేదిక సమర్పిస్తున్నట్లు వారు వివరించారు. ఈ బహిరంగ విచారణలో మండల ప్రత్యేక అధికారి వెంకటేశ్వర రెడ్డి, ఎంపీడీఓ జమలారెడ్డి, అడిషనల్ విజిలెన్స్ అధికారి అనూష, ఎస్ఆర్‌పీ నాగరాజు, అనిల్, ఏపీఓ విజయలక్ష్మి, టీఏలు, ఎఫ్‌ఏలు, అడిట్ బృందాల సభ్యులు పాల్గొన్నారు.

మనుగడకు జలమే ప్రాణాధారం

అశ్వారావుపేటరూరల్: మానవ మనుగడకు జలమే ప్రాణాధారమని ప్రభుత్వ మహిళా డిగ్రీ గురుకుల కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కె.సింధుశ్రీ అన్నారు. శనివారం మండల పరిధిలోని పెదవాగు ప్రాజెక్టు గ్రామంలోని మహిళా డిగ్రీ కళాశాలలో ప్రపంచ జల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులచేత నీటిబొట్టు విలువ, పొదుపు, భూగర్భజలాలు ఇంకిపోవడం, నీరు లేకపోతే ప్రజాజీవానికి జరిగే నష్టం అను అంశాలపై ప్రదర్శనలు చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ నీటి పొదుపు పాటించాలని, ప్రతి ఇంట్లో ఇంకుడు గుంతలు తీయించుకోవాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో అధ్యాపకులు ఎం.అరుణ, భవాని, సుధారాణి, స్పందన, గోపాల్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

భద్రాచలం ఫస్ట్‌క్లాస్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ శివనాయక్


మాట్లాడుతున్న మెజిస్ట్రేట్ శివనాయక్

బూర్గంపాడు: ప్రతి ఒక్కరూ చట్టాలపై కనీస అవగాహన పెంచుకోవాలని భద్రాచలం ఫస్ట్‌క్లాస్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్, మండల లీగల్ సర్వీసెస్ అథారిటీ చైర్మన్ వి.శివనాయక్ సూచించారు. అంజనాపురం ప్రాథమికోన్నత పాఠశాలలో శనివారం మండల లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన పెంచుకుంటే భావితరాలకు నేర రహిత సమాజం సాకారమవుతుందన్నారు. యువత నేర ప్రవృత్తికి దూరంగా ఉండి సన్మార్గంలో నడుచుకుంటు భవిష్యత్ బాగుంటుందన్నారు. వివిధ చట్టాలపై న్యాయవాదులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పాఠశాలలో వైద్యశిబిరం ఏర్పాటు చేసి వైద్యపరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులు అందజేశారు. విద్యార్థులకు బిస్కెట్లు, చాక్లెట్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో భద్రాచలం బార్ అసోసియేషన్ ప్రతినిధులు ముత్యాల కిషోర్, పామరాజు తిరుమలరావు, భజన సతీష్, భాషం శారద, సంధ్య, సాధనపల్లి సతీష్, బూర్గంపాడు ఎస్ఐ రాజేష్, హెచ్‌ఎమ్ కిషన్, అడిషనల్ డీఎంహెచ్ఓ డాక్టర్ చైతన్య, ఉబ్బల రమేష్, పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆత్మారామచంద్రస్వామి కౌలు వేలం పాట

దుమ్ముగూడెం: మండలంలోని నడికుడి, చిన్న నల్లబల్లి గ్రామాల్లోని ఆత్మారామాచంద్ర స్వామి వారి ఆలయ భూముల కౌలు వేలం పాటలను శనివారం నిర్వహించారు. నడికుడి కౌలు వేలం పాటనుజగిడి అర్జున్ రూ.2లక్షల 67వేలకు దక్కింయకోగా, చిన్ననల్లబల్లి భూమికి మర్మం ప్రసాద్ రూ.6వేలకు దక్కించుకున్నారు. ఈ వేలంపాటలో ఇఓ సుదర్శన్, ఇన్స్పెక్టర్ వెంకటేశ్వరరావు, గుమాస్తా కృష్ణ మోహన్, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

దమ్మపేట: మండల కేంద్రం దమ్మపేటలో నేడు(ఆదివారం) విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని, అశ్వారావుపేట విద్యుత్ శాఖ ఏడీఓ వెంకటరత్నం శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. దమ్మపేట ఫీడర్‌లో ఆదివారం మరమ్మతులు నిర్వహించనున్న కారణంగా ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని తెలిపారు. ఈ విషయాన్ని వినియోగదారులు గమనించి, విద్యుత్ సిబ్బందికి సహకరించాలని కోరారు.

మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా కృష్ణవేణి

చంద్రుగొండ: మహిళా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షురాలిగా చంద్రుగొండకు చెందిన బడుగు కృష్ణవేణిని రెండోసారి ఏకగ్రీవంగా నియమించారు. ఈ మేరకు శనివారం ఓ కార్యక్రమంలో కృష్ణవేణికి నియామకపు పత్రాన్ని జిల్లా అధ్యక్షురాలు తోట దేవిప్రసన్న అందించారు. కృష్ణవేణి నియామకంపై ఆ పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశాయి.

సీఎంఓకు సన్మానం

మణుగూరుటౌన్: సింగరేణి చీఫ్ మెడికల్ ఆఫీసర్ పన్నెం సుజాత(సీఎంఓ) ఈనెల 31న ఉద్యోగ విరమణ చేయనుండగా శనివారం సన్మానించారు. మణుగూరులో జరిగిన కార్యక్రమంలో డైరెక్టర్ కొప్పుల వెంకటేశ్వర్లు, జీఎం దుర్గం రాంచందర్ పాల్గొన్నారు.

జాతరకు సహకరించండి

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని లంబాడి కాలనీ, జగదీష్ కాలనీల మధ్య ఉన్న ముత్యాలమ్మ అమ్మవారి ఆలయంలో నిర్వహించే జాతరకు సహకరించాలని జాతర కమిటీ సభ్యులు శనివారం పంచాయతీ ఈఓ శ్రీనివాస్‌కు వినతిప్రతం అందజేశారు. ప్రతి ఏటా ఉగాది పండుగను పురస్కరించుకుని ముత్యాలమ్మ అమ్మవారి జాతరను అత్యంత వైభంగా నిర్వహిస్తామని, పంచాయతీ తరుపున సహకారం అందించాలని వారు కోరారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఈఓకి ఆహ్వాన పత్రికను అందజేశారు. కార్యక్రమంలో ఆకోజు సునీల్ కుమార్, గోసుల శ్రీనివాస్, రామకృష్ణ, గణేష్, రామకృష్ణ, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

యానిమల్ డే..

మణుగూరుటౌన్: పట్టణంలోని బ్రైట్ మైండ్స్ ప్లే స్కూల్‌లో శనివారం యానిమల్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులకు వివిధ రకాల పక్షులు, ఆవులు, మేక, గుర్రం, కుందేలు, చేపలు, కుక్క వంటి జంతువులు, వాటి తీరు, వాటితో మానవులు ప్రవర్తించాల్సిన విధానంపై అవగాహన కల్పించారు. పాఠశాల కరస్పాండెంట్ రాంబాబు, రమ, గ్రీష్మ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వమే బాధ్యత వహించాలి

దుమ్ముగూడెం: మండలంలోని నారాయణరావుపేట బాలుర గిరిజన సంక్షేమ హాస్టల్ విద్యార్థి సోయం సుకుమార్ మృతికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని బీఆర్‌ఎస్ పార్టీ మండల కన్వీనర్ కణితి రాముడు, కోకన్వీనర్ జానీ పాషాలు డిమాండ్ చేశారు. శనివారం పెద్దబండిరేవు గ్రామంలో బాలుడి మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత 10 రోజులుగా విద్యార్థి సోయం సుకుమార్ అనారోగ్యం బారీన పడినప్పటికీ హాస్టల్ సిబ్బంది నిర్లక్ష్యం మూలంగా సరైన వైద్యం అందలేదని, దీంతోనే తల్లిదండ్రులకు భద్రాచలం ప్రభుత్వ వైద్యశాలకు తరలించినప్పటికీ ప్రాణాలు దక్కలేదని అన్నారు. ఆశ్రమ పాఠశాలలో సరైన పోషక ఆహారం అందలేదని, దీంతోనే అనారోగ్యానికి గురయ్యాడని ఆరోపించారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి బాధిత విద్యార్థి కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. మృతదేహాన్ని పరామర్శించిన పార్టీ నాయకులు తునికి కామేష్, దామెర్ల శ్రీనివాసరావు, వాగే కృష్ణ, సోయం నర్సింహారావు, తంత్రంపల్లి వెంకటేశ్వర్లు, సోయం కృష్ణబాబు, బొడా లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

శాలివాహనుల సమస్యలు పరిష్కరించాలి


ఎంపీడీఓ మహాలక్ష్మికి మట్టికుండ బహుకరిస్తున్న సంఘం జిల్లా అధ్యక్షుడు శేషగిరిరావు

అన్నపురెడ్డిపల్లి(చంద్రుగొండ): శాలివాహనుల సమస్యలను పరిష్కరించాలని శాలివాహన సంఘం జిల్లా అధ్యక్షుడు బాడిశ శేషగిరిరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలకేంద్రం అన్నపురెడ్డిపల్లిలో సంఘం ఆధ్వర్యంలో 13 రోజులుగా మట్టి పాత్రల తయారీలో ఇస్తున్న శిక్షణ ముగింపు కార్యక్రమంలో శనివారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మహాలక్ష్మిని కలిసి మట్టికుండను బహుకరించారు. అనంతరం మాట్లాడుతూ.. శాలివాహనులకు సంక్షేమ పథకాల్లో ప్రత్యేక కోటా ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆయన వెంట నాయకులు పెద్దారపు నాగరాజు, ఎ.బాలయోగి, ఎ.సత్యం, గుడిమెట్ల నారాయణ, పి.శ్రీను పాల్గొన్నారు.

పలువురి ముందస్తు అరెస్ట్


దమ్మపేట: పోలీస్ స్టేషన్ వద్ద కార్మిక నాయకులు

చంద్రుగొండ: అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో మండలంలోని బీఆర్‌ఎస్ ముఖ్యనేతలను ముందస్తుగా శనివారం పోలీసులు అరెస్టు చేశారు. అనంతరం వ్యక్తిగత పూచికత్తుపై వారిని విడుదల చేశారు. అరెస్ట్ అయిన వారిలో ఆ పార్టీ నాయకులు దార వెంకటేశ్వరరావు, మెడా మోహన్‌రావు, నల్లమోతు వెంకటనారాయణ ఉన్నారు.

దమ్మపేట: హైదారాబాద్‌లో చలో అసెంబ్లీ ముట్టడికి పయనమైన ఏఐఎస్ఎఫ్ విద్యార్థి, కార్మిక సంఘాల నాయకులను దమ్మపేట పోలీసులు శనివారం తెల్లవారుజామున ముందస్తు అరెస్ట్ చేశారు. పోలీస్ స్టేషన్‌కు వారిని తరలించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ మండల కార్యదర్శి బత్తుల సాయి మాట్లాడుతూ.. అక్రమ అరెస్టులతో ప్రజా ఉద్యమాలను ఆపే ప్రయత్నం చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. అరెస్ట్ అయిన వారిలో కొప్పుల శ్రీను, భోగి సత్యం తదితరులు ఉన్నారు.

అరెస్టులు అప్రజాస్వామికం

దమ్మపేట: కార్మికుల సమస్యలపై ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన వ్యక్తం చేయడానికి హైదారాబాద్ వెళ్లనున్న నాయకులను అరెస్టులు అప్రజాస్వామికం అని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ పార్టీ జిల్లా నాయకుడు అమర్లపూడి రాము అన్నారు. శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ... అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపాలనే ప్రయత్నాన్ని పిరికిపంద చర్యగా అభివర్ణించారు. నాయకులు పండారి వీరబాబు, అనిల్, జగదీష్, నాగమణి, సుజాత, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

కేన్సర్ బాధితురాలికి ఆర్థిక సాయం


చర్ల: మహిళకు ఆర్థిక సాయం అందజేస్తున్న కమిటీ సభ్యులు

చర్ల: మండలంలోని లింగాపురంపాడు గ్రామానికి చెందిన మహిళ షేక్ రిహానా బేగం కేన్సర్ వ్యాధి బారిన పడగా.. వైద్యం చేయించుకునేందుకు ఆర్థికంగా ఇబ్బందిపడుతోంది. విషయం తెలుసుకున్న మేమున్నాం సహాయక కమిటీ ఆర్థిక సాయాన్ని అందజేసింది. శుక్రవారం కమిటీ కార్యాలయంలో ఆ మహిళలకు రూ.20 వేలను అందజేసింది. సహాయక కమిటీ చైర్మన్ నీలి ప్రకాశ్, సభ్యులు దొడ్డా ప్రభుదాసు, కొమరవరపు రవి, దొడ్డి సూరిబాబు, బీవీ ప్రతాప్, దొడ్డి రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

కిడ్నీ బాధితుడికి..

బూర్గంపాడు: పాల్వంచ మండలం పాండురంగాపురం గ్రామానికి చెందిన అనసూరి పరంధామ చారి గత ఏడు నెలలుగా రెండు కిడ్నీలు సంబంధిత సమస్యతో బాధపడుతున్నాడు. వైద్యఖర్చులు, కుటుంబ పోషణకు ఆర్థికంగా ఇబ్బందులు పడుతుండగా.. విషయం తెలిసిన మోరంపల్లిబంజర గ్రామానికి చెందిన నేస్తం చారిటబుల్ వెల్ఫేర్ ట్రస్ట్ శనివారం బాధితుడికి రూ.8 వేల ఆర్థికసాయమందించింది. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ బత్తుల రామకొండారెడ్డి, చింతా అంకిరెడ్డి, సంకా సురేష్, కైపు రమేష్‌రెడ్డి, డి.బాలనారాయణరెడ్డి, తాడోజు నాగాచారి పాల్గొన్నారు.

ఎంఈఓకు వినతి

దమ్మపేట: తమ న్యాయపరమైన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ.. మధ్యాహ్న భోజన కార్మికులు మండల విద్యాశాఖ అధికారి కీసర లక్ష్మికి ఎంఈఓ కార్యాలయంలో శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు పిట్టల అర్జున్ మాట్లాడుతూ.. కార్మికులకు రూ.10 వేల వేతనం మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల 24న హైదరాబాద్‌లో ఇందిరా పార్క్ వద్ద కార్మికుల సమస్యపై నిర్వహించనున్న ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మోరంపూడి శ్రీనివాసరావు, చెన్నకేశవులు, ఈశ్వరమ్మ, కుమారి, సుగుణ పాల్గొన్నారు.

బకాయిలు విడుదల చేయాలి

భద్రాచలంఅర్బన్: భద్రాచలం గ్రామపంచాయతీ కార్మికులకు గత మూడు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే విడుదల చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏజే రమేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన విస్తృత స్థాయి జనరల్ బాడీ సమావేశంలో ఏజే రమేష్ మాట్లాడారు. ఇచ్చే అరకొర జీతాలు కూడా మూడు నెలలుగా చెల్లించకపోడంతో కార్మికులు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. అప్పులు చేసి జీవనం వెల్లదీస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పంచాయతీ కార్మికుల సమస్యలపై ఈ నెల 25న హైదరాబాదులో ఇందిరాపార్క్ దగ్గర జరిగే ధర్నాని జయప్రదం చేయాలని రమేష్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పట్టణ కన్వీనర్ ఎంబి.నర్సారెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు గడ్డం స్వామి, గ్రామ పంచాయతీ యూనియన్ నాయకులు, చందు, శ్రీనివాస్, చెన్నకేశవులు, సాయి, ప్రేమ్ కుమార్, లక్ష్మణ్, వరరాజు, మనోజ్ రెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థినికి ప్రశంస


విద్యార్థిని లేఖనను అభినందిస్తున్న కళాశాల డీన్ డాక్టర్ హేమంత్‌కుమార్

అశ్వారావుపేటరూరల్: స్థానిక వ్యవసాయ కళాశాలలో బీఎస్సీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న కణితి లేఖన రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక కాగా.. శనివారం కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ హేమంత్ కుమార్ ప్రశంసించారు. ఖమ్మంలోని ఓ ప్రైవేటు కళాశాలలో నిర్వహించిన 'వికసిత్ భారత్–యూత్ పార్లమెంట్' డిస్ట్రిక్ సెలెక్షన్–2025లో పాల్గొంది. ఈ పోటీల్లో ప్రతిభ చాటి రాష్ట్ర స్థాయి సెలెక్షన్‌కు ఎంపికైంది. దీంతో స్థానిక కళాశాలలో విద్యార్థినిని డీన్‌తోపాటు, ప్రొఫెసర్లు అభినందించారు. కార్యక్రమంలో జాతీయ సేవా పథకం విభాగం సమన్వయకర్త డాక్టర్ ఎం.రాంప్రసాద్, డాక్టర్ టి.శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.

వీరుల స్ఫూర్తితో ఉద్యమించాలి


బూర్గంపాడు: భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న నాయకులు

భద్రాచలంటౌన్: భారత ఉపఖండాన్ని ప్రభావితం చేస్తూ ప్రాణాలర్పించిన భగత్ సింగ్ రాజగురు, సుఖ దేవ్‌ల స్ఫూర్తితో ఉద్యమించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు కాంపాటి పృథ్వీ పిలుపునిచ్చారు. పట్టణంలోని సాయి డిగ్రీ కళాశాలలో శనివారం భగత్ సింగ్ వర్ధంతి సందర్భంగా భగత్ సింగ్ జీవిత పాఠ్యాంశాన్ని, మరణ సందేశాన్ని విద్యార్థుల్లోకి తీసుకొని వెళ్లేందుకు పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన వారి గురించి వివరించారు. సెమినార్ అనంతరం 15 మందితో పీడీఎస్‌యూ భద్రాచలం డివిజన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. కార్యదర్శిగా మునిగేలా శివ ప్రశాంత్, అధ్యక్షుడుగా గండుగుల రామ్ చరణ్, సహాయ కార్యదర్శిగా భూమిక, కోశాధికారిగా పండుతో పాటు కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు.

సీపీఎం ఆధ్వర్యంలో..

బూర్గంపాడు: సీపీఎం ఆధ్వర్యంలో శనివారం లక్ష్మీపురం గ్రామంలో భగత్‌సింగ్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశం కోసం భగత్ సింగ్ చేసిన త్యాగాలను నాయకులు గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి బత్తుల వెంకటేశ్వర్లు, సాయి, శ్రీనివాస్, లక్ష్మీనారాయణ, రామయ్య, తాటికొండ కృష్ణ, జోగారావు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

పీవైఎల్ ఆధ్వర్యంలో..

అశ్వారావుపేటరూరల్: భగత్‌సింగ్ చేసిన పోరాటాలే స్ఫూర్తిగా పేదల సమస్యలపై పోరాటాలు చేయాలని పీవైఎల్ జిల్లా కార్యదర్శి కొర్సా రామకృష్ణ అన్నారు. శనివారం అశ్వారావుపేటలోని భగత్‌సింగ్ సెంటర్ వద్ద భగత్‌సింగ్ వర్ధంతి సభను నిర్వహించారు. ఈ సందర్భంగా భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలతో నివాళులర్పించి రామకృష్ణ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు గోకినపల్లి ప్రభాకర్, కంగాల వెంకటేష్, వాసం చిన్న గోగయ్య, కొమరం పరమేష్, మడకం నవీన్ పాల్గొన్నారు.